

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదురుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత(బెంగుళూరు)*

# *కనిపించాడు వీరకంబన్....*

**పరమ విచిత్రంగా వినిపించే ఇది అతని అసలు పేరు కాదు.** మరి 'ఈ పేరేమిటి? అతనెవరు? కనిపించడమేమిటి?' ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం కావాలంటే అతని కథ తెలుసుకోవలసినదే చింతచిగురు పులుపనీ, చీకటంటె నలుపనీ చెప్పందే తెలియనీ చిన్నపిల్లా .. టైపులో అతనో గొప్ప అమాయకుడు.. గొప్ప అని ఎందుకు అనవలసి వచ్చిందంటే గొప్ప మనసున్న అమాయకుడన్నమాట. 'అందరూ మంచివాళ్ళే', అంతా తనవారే అనుకునే రకం.

వీరకంబన్ అసలు పేరు నరసింహం. చిన్నప్పటినించీ అతనికి చరిత్ర అంటే వల్లమాలిన ఇష్టం. ప్రతీవిషయాన్నీ విపులంగా తెలుసుకుంటేనే కానీ వదిలేవాడు కాదు. పెద్దరుగుల సుబ్బారావుగారి పెరటివైపున ఉన్న చిన్న ఇంట్లో ఉండేవారు నరసింహమూ, అతని చెల్లెలూ, తల్లీ, తండ్రీ. ఆ ఇల్లు కూడా చిన్న అరుగులు, వెడల్పుగా ఎత్తు తక్కువగా ఉన్న మెట్లూ , బాగా కిందకి దిగిన చూరుతో బావుండేది. అందుకే వాళ్ళ అమ్మగారు ఇంటికి నలువైపులా ఆనప, కాకర, చిక్కుడు ఇలాంటి పాదులు ఎక్కించేది ఇంటిమీదకి. చాలా సార్లు నేల మీద నిలబడే అవన్నీ కోసేసుకునేవారు వాళ్ళు. అతని అక్కయ్యలిద్దరికీ పెళ్ళిళ్ళయిపోయాయి.

ఎక్కడో నాలుగు ఊళ్ళ అవతల ఉన్న కొద్దిపాటి పొలం సంవత్సరానికి సరిపడా బియ్యం కొలిచి ఇచ్చేది. పౌరోహిత్యం చేసి వాళ్ళ నాన్నగారు ఇంటి ఖర్చులు వెళ్ళదీసేవారు. నరసింహానికి ఊరంతా స్నేహితులే. ఎప్పుడూ నలుగురిళ్ళల్లోనూ గిలకలా తిరుగుతూ ఉండేవాడు. అతనికి బాగా చిన్నప్పుడే వాళ్ళ నాన్న గారు మంత్రపుష్పం, నమకం, చమకం, అరుణం, పురుష సూక్తం లాంటివన్నీ నేర్పించారు. చాలా

చక్కని కంఠం నరసింహానిది. అతని మాట మంత్రంలా , మంత్రం వేదంలా, వేదం అమరనాదంలా వినిపించేది. అదేం విచిత్రమో, అతనన్న మాటలన్నీ నిజమై నిలిచేవి. 'ఇవ్వాళ వర్షం వస్తుందిరా!', పందెం అని సరదాగా అన్నా సరే మరో రెండు మూడు గంటలకి భళ్ళున కాసే ఎండ కూడా మేఘాల దుప్పటి కప్పేసుకుని కరిగి నీరైపోయేది. ఇంత చిన్న విషయం దగ్గరనించీ ఎన్నో విషయాలు నిజమయ్యేవి.

అన్ని విషయాలు తెలుసు. ఒక్క బ్రతకనేర్వడం తప్ప. నాలుగిళ్ళ అవతల ఉన్న పప్పువారి పిల్లలతో మహా స్నేహం. వారు ఎక్కడికెళితే అక్కడకి వారి వెంటే తిరిగేవాడు. చరిత్ర అంటే ఇష్టం అని ముందే చెప్పుకున్నాం కదా, ఎక్కడెక్కడివో పుస్తకాలు అడిగి తెచుకుని మరీ చదివేవాడు. 'చెన్నపట్నం మద్రాస్ ఏలా అయింది? మామల్ల పురాన్ని మహాబలిపురం అని ఎప్పుడు మార్చారు? షాజహాన్ ఏం కట్టించాడు?' ఇలా అతని ఆలోచనలన్నీ ఎప్పుడూ చరిత్ర చుట్టూ తిరుగుతూ ఉండేవి. 'అదొక్కటేనా?' తనకి తెలిసినది నలుగురికి చెపితేనే కానీ నిద్ర పట్టదు. మంచివిషయాలు అందరితోనూ  పంచుకోవాలి అనేవాడు. అందుకే అతను ఎదైనా చరిత్ర విషయాలు చెప్పడం మొదలు పెట్టగానే అతని మిత్రులు " ఒరే నాయనా చరిత్ర చెప్పకు, చెప్పింది విను` అని ఎగతాళి చేసేవారు.

అతను అలా చదివిన ఒక పుస్తకంలో 'వీరపాండ్య కట్టబొమ్మన్' గురించి చదివాడు. ఆ రోజుల్లోనే బ్రిటిష్ వారిని ఎదిరించి నిలిచిన ఆ వీరుని చరిత్ర అతనిని చాలా ఆకట్టుకుంది. పప్పువారి అబ్బాయిలు అప్పట్లోనే క్రికెట్ మాచ్‌లు చూడడానికి మెడ్రాస్ వెళ్ళేవారు, నరసింహం కూడా వారితో పాటే.. ఒకసారి 'నడిగర్ తిలకం శివాజీ గణేశన్ 'అత్యద్భుతంగా నటించిన 'వీరపాండ్య కట్టబొమ్మన్' సినిమా చూసారు మద్రాస్‌లో. అంతే. అసలే అతని చరిత్ర చదివి పరవశించిపోయి ఉన్న నరసింహానికి అది కళ్ళముందు కనిపించేసరికి ముగ్దుడైపోయాడు. ఇంక అప్పటినించీ అడిగినవారికీ, అడగని వారికీ  కథ చెప్పడం, సినిమా గురించి చెప్పడం, ముందూ, వెనక అన్న మాటే తప్ప ఈ రెండూ తప్పకుండా జరిగి తీరవలసినదే

దానితో అందరూ వస్తున్నాడురా 'వీరపాండ్య కట్టబొమ్మన్' అని వెక్కిరించేవారు. ఆ పేరు చాలా పొడుగ్గా ఉండడం మూలాన, కాలక్రమంలో 'వీరకంబన్' అని పొడి అక్షరాలతో అతని పేరుగా స్థిరపడిపోయింది. అగ్రహారంలో నాటినించీ 'నరసింహం' అంటే కన్నా 'వీరకంబన్' అంటేనే బాగా తెలుస్తుంది మరి. ఎవరేమన్నా అతను పట్టించుకునేవాడు కాదు. తన దారి తనది తనది అన్నట్టుగా ఉండేవాడు. ఎవ్వరికేం కావలన్నా చిటికెలో సహాయం చేసేవాడు.

అంతే కాదు.. ఎప్పుడూ అందరితోనూ అనేవాడు కూడా.. " ఊరికే తినేసి తిరిగేస్తే సరదా ఏముందిరా? మనిషన్నాక నలుగురూ చెప్పుకునేలా బ్రతకాలి. లేకపోతే మనకెన్నేళ్ళువచ్చినా, కొబ్బరి చెట్టుకెన్నేళ్ళు వచ్చినా ఒకటే. పెద్ద తేడా ఏముంది? ఇంకా కొబ్బరి చెట్టే నయం, తనకి వీలున్నంతలో మనిషికెంతో ఉపయోగపడుతుంది కూడానూ. అందుకే మహాపురుషులు చరిత్రలో నిలిచినవారి గురించి చదివితేనే ఆనందంతో నా మనసు పులకరిస్తుంది.. ఎప్పటికైనా మనం జీవితంలో నలుగురికి ఉపయోగ పడితే అంతే చాలు " అనేవాడు ఎంతో మనస్ఫూర్తిగా.

స్వాతంత్ర సమరయోధులలో కట్టబొమ్మన్ అంటే ఎంత ప్రాణమో,  దేవుళ్ళలో హనుమంతుడంటే అంత భక్తి. హనుమంతుడిలాగే అతని శక్తి అతనికి తెలీదు అని స్నేహితులంతా పురెక్కిస్తూ ఉంటారు. వారికేదైనా పని ఉంటే 'వీరంజనేయా లేవయ్యా. ఆది మర్కట మర్కటాయ. సంజీవి తే వెళ్ళుమా,  ఓ అంజనీ పుత్రా ! ' అని పాడేవారు. దానితో వీరకంబన్ నిజంగానే వెళ్ళి అనుకున్న పని సాధించుకుని వచ్చేసేవాడు. అది అమలాపురం సైకిల్ మీద వెళ్ళి సినిమా టిక్కట్లు తేవడమైనా సరే.. దేవుడి పెళ్ళి సంబరానికి ముత్యాల పల్లకి అలంకరించి  మోయడమైనా సరే.. అదేం చిత్రమో? ఏ పనైనా సరే ముందు నా వల్లనేమవుతుంది? అనేవాడు.. ఎవరైనా అనునయంగా చెప్తే చేసుకొచ్చేసేవాడు

ఇలాంటి చాలా విచిత్రమైన వ్యక్తి అతను. తెలియకుండా అంటాడో, నిజంగానే ఊహించి అంటాడో తెలియదు కానీ అతనన్న మాటలన్నీ దాదాపుగా నిజం అవుతాయి. అవి మంచివైనా సరే, చెడ్డవైనా సరే. అలా అని అతనికేమీ జ్యోతిష్యం తెలీదు. కల్మషం లేని మనసు, మొదటినించీ వేదం, గాయత్రీ చదివిన నాలిక.. అందుకే అబ్బిందేమో వాక్శుద్ధి అనుకుంటూ ఉంటారు.

పీ.యూ.సీ పూర్తి అవగానే వాళ్ళ నాన్నగారు " ఒరే నాయనా! నీకు మెళ్ళో జంధ్యప్పోగు వేసి చెవులో గాయత్రి చెప్పాను కదా. ఇంక మన నట్టింటో గాయత్రి తిరిగే రోజు వచ్చింది . మరి నువ్వు ఊ అంటే మీ మావయ్య తన పనులు మొదలు పెడతాడు " అన్నారు.

గాయత్రి అతని మేనమామ కూతురు. చిన్నప్పటినించీ సింహం బావను తప్ప మరెవరినీ చేసుకోనని పట్టు పట్టి కూర్చుంది. - ఆమాట విని ఇంతెత్తున ఎగిరాడు..

"నా ఇష్టదైవం ఘోటకబ్రహ్మచారి, మరి నన్నెలా పెళ్ళిచేసుకోమంటారు? శాంత! వీల్లేదు" అని.

" అదేవిటా అలా అంటావు? అలా చూస్తే మన ఇలవేల్పు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి, అలా అని మీ నాన్నా, పెద నాన్నా వీళ్ళందరూ రెండేసి పెళ్ళిళ్ళు చేసుకోవాలా మరి? అందులో మీ పెద్దనాన్న స్వామి గుడిలో పూజరి కూడానూ "అని వాళ్ళ అమ్మ సావిత్రమ్మ గారు అతనికి తగ్గ తర్కం తీసింది.

"పిడివాదాలు వద్దు. భగవంతుని మనం ఆరాధించాలి, దేవదేవుడి ఒక్కొక్క రూపానికీ ఒక్కొక్క కారణమూ, ప్రయోజనమూ ఉన్నాయి.. అవి మానవమాత్రులం, మన అంచనాలకి అందనివి, ఎంచతగ్గవారం కాదు మనం" అని వాళ్ళ నాన్నగారు విడమరిచి చెప్పారు. అలా వేద మంత్రాల మధ్యన గాయత్రి అతని జీవితంలోకి అడుగు పెట్టింది. ఆమె చాలా చురుకైనది, తెలివైనది.. చక్కగా సంసారాన్ని సర్ది నడిపేది. కుప్తత, నిలకడా తెలిసిన మె సాంగత్యంలో అతని జీవితం హాయిగా సాగింది. ఇద్దరు పిల్లలు పెద్దవాళ్ళయి ప్రయోజకులయ్యారు.

పక్క ఊరిలో ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటూ , నలుగురికీ వీలైనంతగా ఉపయోగపడుతూ ఉన్నా సరే అతనికి ఎప్పుడూ ఏదో అసంతృప్తి.' నలుగురికీ ఏదైనా చెయ్యాలి. నాలుగు కాలాలపాటు మన పేరు నిలిచేలా ఉండాలి 'అనే తపన. ' కానీ సంసార బాధ్యతలో? ముందు ఈ సాగరం ఈదితేనే కదా?' అనుకునేవాడు. రిటైరయిననాటినించీ అతనికీ చింత మరీ ఎక్కువయింది. దానికి తోడు గాయత్రి హఠన్మరణం అతనిని మరింత కృంగదీసింది.

ఒకనాటి ఉదయం ఆరు బయట మంచం వేసుకుని పడుకున్న నరసింహం కనిపించలేదు. పెరట్లో కేదైనా వెళ్ళాడేమో అనుకున్నారు కొడుకులు. గంటయినా, రెండుగంటలయిగా రాలేదు. 'ఎవరితోనూ చెప్పకుండా ఎక్కడికెళ్ళాడు?' అని అనుకున్నారు. సాయంత్రమైనా ఇల్లు చేరకపోయేసరికి అప్పుడు కంగారు పడటం మొదలుపెట్టారు. రెండు రోజులు గడిచింది అయినా వీరకంబన్ జాడ లేదు. 'ఏమయిపోయాడబ్బా?' అనుకుని గాభరా మొదలయింది. చుట్టుపక్కల నాలుగు ఊర్లకీ కబుర్లు పెట్టారు,మనుషులని పంపి వెతికించారు. అతని జాడ తెలియలేదు...

ఏమయిపోయాడో తెలియదు.. పొరపాటున ఎక్కడకైనా వెళ్ళిపోయాడా? ప్రమాదమేమీ జరగలేదు కదా అని కొడుకులూ, కోడళ్ళూ చాలా మధనపడ్డారు. ఎంతో వెతికించారు. ఇంక చేసేదేమీ లేక దైవం మీద భారం వేసి అతని రాక కోసం ఎదురుచూడ సాగారు. అంతకంటే ఏమీ చేయలేక. 'కాశీలో చూసామని ఒకరు, రామేశ్వరం వెళ్ళాడని ఒకరూ' ఇలా గాలి వార్తలు తప్ప నిజమేమీ తెలియలేదు.

ఈ క్రమంలో కొన్నేళ్ళు గడిచి పోయాయి. ఇది జరిగి దాదాపు పదేళ్ళు కావస్తోంది.

బట్టల వ్యాపారపు పనిమీద విజయవాడ వెళ్ళాడు భవానీ శంకరం. వచ్చిన పని చూసుకుని తోడల్లుడి ఇంటికి వెళ్ళాడు. మధ్యాహ్నం భోజనం చేసాకా కబుర్లలో పడ్డారు. మాటల్లో 'ఈ మధ్యనే కొత్తగా కట్టిన గుడికి వెళదాం రమ్మని 'బయలుదేరదీశాడు తోడల్లుడు ఆనందం..

మెల్లిగా నడుచుకుంటూ బయలుదేరారు. చిన్న చిన్న గుళ్ళ సముదాయంలా ఉంది అది. ఒక పక్కన వెంకటేశ్వరస్వామి గుడి, మరొక పక్కన వినాయకుడు, మూడోది హనుమంతుడు.. మూడు గుళ్ళకీ కలిపి చుట్టూ ప్రాకారం. ఎంతో ముచ్చటగా ఉంది గుడి.

అది కాదు భవానీ శంకరాన్ని ఆకర్షించింది. ఒక మూలన చక్కగా ఉన్న మండపం. పెద్ద పెద్ద ఇనప స్థంభాలు లేపి దానిమీద బంగాళా పెంకులు వేసి కట్టారు. కింద చలవరాతి బండలు పరిచి చపటా కట్టారు. దాని పక్కనే వేప, రావి చెట్లు కలిసి ఏపుగా పెరిగాయి. చల్లగా గాలి వేస్తోంది. మంటపం మధ్యలో కూర్చుని ఉన్నాడు ఒక వ్యక్తి. పద్మాసనంలో ఉన్నాడు అతను. చుట్టూ ఒక పదిమంది కూర్చుని ఉన్నారు. అతను మంద్రమైన స్వరంతో దేవీ భాగవతప్రవచనం చెప్తున్నాడు. చుట్టూ కూర్చున్న వాళ్ళందరూ భక్తిభావంతో వింటున్నారు.

మరొక పదినిమిషాలలో అతని ఉపన్యాసం పూర్తి అయింది. వచ్చినవారందరూ అతనికి నమ స్కరిస్తూ పళ్ళూ, స్వీట్లు అవీ అతని చేతిలో పెడుతున్నారు. తరవాత నలుగురైదుగురు ఆగి తమ పిల్లల పుట్టువెంట్రుకలకీ, అక్షరాభ్యాసానికీ, అన్నప్రాసనలకీ ముహూర్తాలు పెట్టమని అడుగుతున్నారు. అతను చిరునవ్వుతో అందరికీ పంచాగం చూసి, పసుపు రాసిన కాగితాల మీద గుండ్రని చేతివ్రాతతో రాసి, వెనక ఉన్నవెంకటేశ్వరస్వామి విగ్రహం పాదాల దగ్గర పెట్టి, కుంకుమ పొట్లం కట్టి ఇస్తున్నారు. భవానీ శంకరం అతని వైపే చూడసాగాడు.

నెరిసి పొడుగ్గాపెరిగిన జుట్టూ, గడ్డమూ, నుదుటన మెరుస్తున్న ఎర్రటి కుంకుమ బొట్టూ, తెల్లని పంచె, పైన వేసుకున్న 'హరే రామ' ఉత్తరీయమూ, మెడలో రుద్రాక్ష తావళాలు, యోగిలా ఉన్నాడు ప్రశాంతమైనముఖంలో చెదరని చిరునవ్వు, ఎంతో ఓపికగా సమాధానాలు చెప్తున్న అతనిని తదేకంగా చూస్తున్న శంకరాన్ని చూసి 'ఏమిటన్నయ్యా అలా చూస్తున్నావు? అని అడిగాడు అతని తోడల్లుడు. 'అతను.. అతనెవరు? బాగా తెలిసిన ముఖం లా ఉంది' అన్నాడు శంకరం. "ఆయన పేరు పంతులు గారు.. ఆయన దగ్గరుండి ఈ గుడి కట్టించారు. ఎక్కడనించి వచ్చారో తెలియదు, దాదాపు పదేళ్ళక్రితం అనుకుంటా ఇక్కడకి వచ్చారు. అవతల కనిపిస్తోంది కదా, ఆమూల ఇంట్లో అద్దెకుండేవారు. ప్రతీ ఒక్కరికీ చేతనైనంత సహాయం చేసేవారు, గోదావరి తీరం వాడిననీ, ఎవరిదో తెలియని ఆనతి మీద దేశమంతా తిరిగి చివరికి ఇక్కడకి వచ్చాననీ చెప్పేవారుట. తన పని ఏదో, తనేదో అన్నట్టుగా ఉండేవారు. ప్రతీరోజూ దైవ ప్రార్ధనా, పరసేవలోనే కాలం గడిపేవారుట. ఒకరోజు వారి ఇంటివారింట్లో హడావుడి మొదలైంది. వారి అమ్మాయి, అల్లుడూ వస్తున్న బస్‌కి ఆక్సిడెంట్ అయ్యిందని వార్త తెలిసి అందరూ ఒకటే కంగారు పడసాగారు. ఇంతలో ఈ నరసింహం గారు అక్కడకి వచ్చి నిదానంగా, మీ వాళ్ళకేమీ ప్రమాదం లేదు, నా మాట నమ్మి ధైర్యంగా ఉండండి. త్వరలోనే వచ్చేస్తారు" అని అనేసి తన వాటాలోకి వెళ్ళిపోయారుట.

ఆయన ఆ మాట చెప్పిన గంటకి సరిగ్గా ఇంటి ముందు కార్ ఆగడమూ అందులోంచి వాళ్ళ అల్లుడూ, కూతురూ దిగడమూ జరిగింది. అడిగితే. వారి అల్లుడుగారికి ఆఫీస్‌లో లేట్ అయినందున బస్ టిక్కట్లు కాన్సిల్ చేసుకుని, టాక్సీ చేసుకుని వచ్చారుట. ఆ నాటినించీ ఆయన మాట వారికి వేదవాక్కయింది.

వెంటనే వెళ్ళి ముందు నరసింహంగారికే వార్త చెప్పిందా ఇల్లాలు. ఆనాటినించీ ఈ నాటివరకూ వారి ఇంట్లో మనిషిలాగే చూసుకుంటారు. ఆయనకి చెప్పకుండా ఏ పనీ చెయ్యరు, ఎక్కడకీ వెళ్ళరు. అలా ఆయనగురించి అందరికీ తెలిసి చుట్టుపక్కలవాళ్ళందరూ ఆయన దగ్గరకి రావడమూ, ఆయన చెప్పిన మాట ఎంతో మందికి పని నిజమై అందరికీ ఎంతో గురి కుదరడమూ తొందరలోనే జరిగిపోయాయి.. ఇక్కడ ఈ గుడి కడదామని అనుకోగానే ఆయన చేసిన సేవ మాటల్లో చెప్పలేము. ప్రతీ ఇటుకా దగ్గరుండి వేయించారు. ఏ విగ్రహాన్ని ఎక్కడ ప్రతిష్ఠించాలో, ఎలాంటి పూజలు చెయ్యాలో అన్నీ దగ్గరుండి చేయించారు. అప్పుడే ఈ చుట్టుపక్కల వాళ్ళు అందరూ చందాలు వేసుకుని గుడి ప్రాగంణంలోనే ఆయనకి ఒక భజన మందిరం, రెండు గదులూ, బాత్రూం కట్టించారు.

ఎక్కడనించి వచ్చారో తెలీదు కానీ 'పంతులుగారూ ఎప్పటికీ మమ్మల్ని వదిలి వెళ్ళకండి' అని ప్రాధేయపడ్డారు. ఆయనకి తెలియని విషయం లేదు. ప్రతీ రోజూ గుడిలో ధ్యానం చేసుకుంటారు, తరవాత మా చుట్టుపక్కల అందరి ఇళ్ళళ్ళోనూ అందరి యోగక్షేమాలు విచారిస్తారు. పచ్చదనానికీ, పరిశుభ్రానికీ ఎంతో ప్రాముఖ్యత ఇస్తారు, అందరికీ వాటివల్ల ఉపయోగాలగురించి చెప్తారు. లేదా కాలనీ కి పనికొచ్చే మరేదైనా పని చేస్తాతు. తరవాత గుడికి వచ్చి భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటారు. మధ్యాహ్నం ఎదో ఒక ప్రవచనం చెప్తారు. పిల్లలకి జన్మనక్షత్రాన్ని బట్టి పేర్లు పెట్టడమూం ముహూర్తాలు పెట్టడమూ ఇలాంటీవన్నీ ఎంతో ఓపికగా చేస్తారు. అంతేకాదు మా కాలనీలో యువకులనందరినీ ఒక జట్టుగా చేసారు. వీధి దీపాల కింద నిలబడి క్రికెట్ మాచ్‌ల గురించి గంటలతరబడి చర్చిస్తూ కాలాన్ని రోజూ వ్యర్థపరచేబదులు కనీసం వారానికి ఒకసారి ఎదైనా మంచి పని చెయ్యమని ఎంతో ప్రోత్సాహించారు

దానివల్ల మా వీధిలో ఒక చిన్న లైబ్రరీ వెలిసింది. పిల్లలు వాళ్ళకోసం వాళ్ళే నడుపుకుంటున్నారు. కాలనీ లో ఉన్న మూడు పార్కులు శుభ్రం చేసారు. పెద్దవారికి రోజూ పురాణ కాలక్షేపంచేస్తారు. అందరికీ ప్రాణాయామం, యోగా లాంటివి చెప్తారు. తన చుట్టూ ఉన్నవారెప్పుడూ సంతోషంగా ఉండాలని ఎప్పుడూ తపన పడతారు. వ్యక్తి శ్రేయస్సు సమాజ శ్రేయస్సులోనే ఉందని మనసారా నమ్ముతారు. మానవత్వం, తద్వారా అబ్బిన దైవత్వానికి ప్రతిరూపం అని చెప్పుకోవచ్చు పంతులుగారి గురించి. తనకేమీ కావాలని ఆశించరు. ఇచ్చినవన్నీ అందరికీ పంచుతారు. ఒక్క రూపాయి డబ్బు తీసుకోరు. ఏవరేది ఇచినా గుడి ద్వారా ఏదో ఒక మంచి కార్యానికి ఉపయోగపడాలనే తపిస్తారు. ఈ మధ్యనే మా ఊరి 'లయన్స్ క్లబ్ ' వారు ఆయనని సన్మానించారు కూడా

ఆయ ఎవరో మాకెవరికీ తెలియదు ఒకప్పుడు.. ఇప్పుడు మా కాలనీలో చాలా మందికి ఆయన లేకపోతే ఎలాగో? అనేది తెలియదు అన్నాడు ఆనందం. శంకరం శ్రద్ధగా విన్నాడు అప్పటివరకూ ఆనందం చెప్పినది..

అప్పుడన్నాడు " మెల్లిగా ఆయనెవరో నాకు తెలుసు" అని.

" తెలుసా? మరి నన్నెందుకు ఇన్ని వివరాలు అడిగావు అన్నయ్యా" అన్నాడు.

" మరేమీ లేదు. 'వీరకంబన్' అనే మా చిన్ననాటి మిత్రుడు కనిపించాడు అని మా ఊరివారందరికీ ఆనందంగా చెప్పవచ్చా, లేదా ? అని ఖరారు చేసుకోవడానికే అడిగాను" అన్నాడు.

" వీరకంబన్ ఎవరు? ఆ పేరేమిటీ అసలు" అన్నాడు ఆనందం ఆశ్చర్యంగా.

" చెప్తాను.. ఇప్పుడు కాదు, ఇప్పుడే మా ఊరు వెళ్ళి మా మిగతా వారిని తీసుకొస్తాను. అప్పుడు నీకన్నీ వివరంగా చెప్తాను. ఎప్పుడూ ఏదో ఒకటి చెయ్యాలి, మన తర్వాత నలుగురు మనల్ని తలుచుకోవాలి అని ఎప్పుడూ అనేవాడు.. ఆ మాట మీద నిలబడ్డాడు. చరిత్ర చెప్పడమే కాదు చరిత్రలో నిలిచే విధంగా ఎదిగాడు, చేసి చూపించాడు." అన్నాడు సంరంభం, ఆనందం కలగలిసిన గొంతుతో.

**Click here to share your comments on this article**